క్లుప్తంగా

గంగమ్మ సేవలో భూమన


గంగమ్మను దర్శించుకుంటున్న భూమన కరుణాకర రెడ్డి

రామచంద్రాపురం(చంద్రగిరి): మండల పరిధిలోని నెన్నూరు గ్రామంలో బుధవారం గంగమ్మ జాతర ఘనంగా జరిగింది. మంగళవారం రాత్రి అమ్మవారి విగ్రహాన్ని ఏర్పాటు చేసి బుధవారం ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా గ్రామంలోని మహిళలు సామూహికంగా అమ్మవారికి పొంగళ్లను నైవేద్యంగా సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. టీటీడీ మాజీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉమ్మడి జిల్లాల అధ్యక్షుడు భూమన కరుణాకర రెడ్డి పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు వైఎస్సార్‌సీపీ నేతలు, అభిమానులు ఘన స్వాగతం పలికారు. అమ్మవారిని దర్శించుకున్న అనంతరం ఆయనను జాతర నిర్వాహకులు, గ్రామస్తులు ఘనంగా సత్కరించి, అమ్మవారి తీర్థ ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో పార్టీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

సాంకేతిక విప్లవకర్త రాజీవ్‌గాంధీ


మాట్లాడుతున్న గౌడపేరు చిట్టిబాబు

తిరుపతి అర్బన్: ఆధునిక భారతదేశ నిర్మాణానికి మూలస్తంభం, సాంకేతిక విప్లవకర్త మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ అని తిరుపతి నగర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గౌడపేరు చిట్టిబాబు అన్నారు. బుధవారం రాజీవ్ గాంధీ వర్ధంతిని పురస్కరించుకుని పాత మున్సిపల్ కార్యాలయం వద్ద ఆయన విగ్రహానికి పాలాభిషేకం చేసి పూలమాలలతో నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అతి చిన్న వయసులోని దేశ ప్రధానిగా రాజీవ్‌గాంధీ బాధ్యతలు చేపట్టి ఎంతో సమర్థవంతంగా పనిచేశారని కొనియాడారు. రాజీవ్ గాంధీ పాలనలోనే బడుగు, బలహీన వర్గాలకు ఎంతో ప్రయోజనం చేకూరిందని, సంక్షేమ పథకాలకు శ్రీకారం చుట్టారని తెలియజేశారు. ఆయన బాటలోనే ఇప్పుడు రాహుల్‌గాంధీ దేశప్రజల సంక్షేమం, భద్రత, ప్రగతి కోసం పోరాడుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో పీసీసీ ఉపాధ్యక్షుడు దొడ్డారెడ్డి రాంభూపాల్ రెడ్డి, పార్టీ నేతలు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకుల వితరణ

తిరుపతి రూరల్ (రామచంద్రాపురం) : రామచంద్రాపురం మండలం జెడ్పీటీసీ సభ్యురాలు ఢిల్లీరాణి భర్త భానుకుమార్‌రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని మండలంలో పెద్దఎత్తున ఆ పార్టీ నేతలు, కార్యకర్తలు సంబరాలు జరిపారు. సి.రామాపురం గ్రామంలో పార్టీ నేతలు, కార్యకర్తలు కేక్ కట్ చేయగా తిరుపతి రూరల్ మండలం దుర్గసముద్రం సమీపంలోని అక్షయక్షేత్రంలో బుద్ధిమాంద్యం పిల్లలకు సరిపడా నిత్యావసర సరుకులు అందజేయడంతో పాటు కేక్ కట్ చేశారు. అలాగే తిరు పతి రుయా ఆస్పత్రి ఆవరణలో వైఎస్సార్‌సీపీ నేత లు శశిధర్‌రెడ్డి పేదలకు అన్నదానం నిర్వహించారు.

ఒకరికి గాయాలు

తిరుపతి క్రైమ్ : నగరంలోని గరుడ వారధిపై మంగళవారం రాత్రి జరిగిన ప్రమాదంలో ఓ వ్యక్తి గాయపడ్డాడు. వివరాలు.. విశాఖపట్నానికి చెందిన ఏపీఎస్పీ కానిస్టేబుల్ గణేష్ (39) తిరుపతిలోని టీటీడీ విభాగంలో పనిచేస్తున్నాడు. విధులు ముగించుకుని బైక్‌పై ఇంటికి వెళుతుండగా అలిపిరి పోలీస్ స్టేషన్ దగ్గర అదుపుతప్పి రైలింగ్‌ను ఢీకొన్నాడు. క్షతగాత్రుడు ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్సపొందుతున్నట్లు ఎస్ఐ లోకేష్ తెలిపారు.

స్విమ్స్‌లో సెక్యూరిటీ ఓవరాక్షన్

తిరుపతి, తుడా : స్విమ్స్ ఆసుపత్రిలో సెక్యూరిటీ సిబ్బంది దురుసు ప్రవర్తన రోగుల సహాయలకు ఇబ్బందులు కలగజేస్తోంది. బుధవారం రాత్రి 11 గంటల సమయంలో సెక్యూరిటీ సిబ్బంది రోగి సహాయకులపై గొడవకు దిగారు. ఐసీయూ వద్ద రోగి సహాయకులను కించపరుస్తూ బండబూతులు తిడుతూ ఎంత చెప్పినా మాట వినరా అంటూ వారిని భయభ్రాంతులకు గురిచేశారు. తమ మాటకు ఎదురుచెబుతారా అంటూ కక్ష సాధింపులో భాగంగా మరుగుదొడ్లకు సెక్యూరిటీ సిబ్బంది తాళాలు వేశారు. దీనిపై ఈఓకు ఫిర్యాదు చేస్తామని రోగుల బంధువులు చెప్పగా ..ఈఓకు కాదు.. దిక్కున్నచోట చెప్పుకో అంటూ విధుల్లో ఉన్న సెక్యూరిటీ సిబ్బంది రోగి బంధువులపై బెదిరింపులకు దిగారు. దీనిపై వారు ఈ విషయాన్ని మీడియా దృష్టికి తీసుకొచ్చి న్యాయం చేయాలని వేడుకున్నారు.

ఆధ్యాత్మిక నగరంలో అష్ట దరిద్రాలు

తిరుపతి కేటీరోడ్డులో ఆలయం పక్కనే వెలసిన మద్యం షాపు



రాజీవ్‌గాంధీ నగర్ జీవా వైన్స్ వద్ద రోడ్డులో బహిరంగంగా మద్యం సేవిస్తున్న దృశ్యాలు, ఓ చిల్లర దుకాణం వద్ద బహిరంగంగా మద్యం సేవిస్తున్న మందుబాబులు








తప్ప తాగి తిరుమల బైపాస్ రోడ్డు డివైడర్లపై నిద్రిస్తున్న మందుబాబులు

నిత్యం గోవింద నామస్మరణతో విరాజిల్లే ఆధ్యాత్మిక నగరంలో ప్రశాంతత కరువైంది. భక్తిపారవశ్యంలో ఓలలాడాల్సిన తిరునగరి కూటమి ప్రభుత్వ పాలకుల పుణ్యమా అని వివాదాలకు కేంద్రబిందువు అవుతోంది. ఉదయం శ్రీవేంకటేశ్వరుని సుప్రభాతంకంటే ముందు మందుబాబుల అరుపులు, గంజాయి బ్యాంచ్ కేకలతో అలజడి రేగుతోంది. ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన తిరుపతి నగరంలో కూటమి పాలకులు రాష్ట్రంలో ఎక్కడా లేనన్ని మద్యం షాపులకు అనుమతులిచ్చి మద్యానికి నిలయంగా మార్చేశారు. ఉదయం లేచింది మొదలు కొందరు వైన్‌షాపుల వద్దకు బహిరంగంగా మద్యం సేవిస్తూ కనిపిస్తున్నారు. నడి రోడ్లపై తాగిన మైకంలో వాహనాల మధ్య నిలబడి అంతరాయం కలిగిస్తున్నారు. మహిళలు, పిల్లలు రోడ్ల వెంబడి వెళ్లాలంటే భయపడుతున్నారు. శ్రీనివాస సేతు వంతెన కింద పూటుగా తాగి వచ్చి సేదతీరుతున్నారు. నగరంతో పాటు నగర శివార్లు సైతం మందు, గంజాయి బ్యాచ్‌ల చిల్లర గొడవల కారణంగా స్థానికులు బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. వీటిని అరికట్టాల్సిన పోలీసు యంత్రాంగం ఏమీ పట్టనట్లు మిన్నకుండిపోవడం గమనార్హం.

- సాక్షి ఫొటోగ్రాఫర్, తిరుపతి


లీలామహల్ అమీర్‌ఖాన్ బార్ రోడ్డులో మందుబాబు హల్‌చల్

గంగమ్మలకు సారె సమర్పణ


నెన్నూరులో గంగమ్మ జాతరకు సారెను అందిస్తున్న చెవిరెడ్డి లక్ష్మి


రాయలచెరువులో సారె తీసుకెళ్తున్న చెవిరెడ్డి లక్ష్మి

తిరుపతి రూరల్ (రామచంద్రాపురం): రామచంద్రాపురం మండలం నెన్నూరు, రాయలచెరువుపేట గ్రామాల్లో బుధవారం జరిగిన గంగమ్మ జాతర్లకు చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి సతీమణి చెవిరెడ్డి లక్ష్మి సారెను సమర్పించారు. ఏటా గ్రామాల్లో జరిగే గంగమ్మ జాతర్లకు తుమ్మలగుంట శ్రీ కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయం నుంచి పసుపు, కుంకుమ, గాజులు, వస్త్రాలతో కూడిన సారెను అందించడం ఆనవాయితీ. ఈ మేరకు నెన్నూరు, రాయలచెరువు గ్రామస్తుల ఆహ్వానం మేరకు సారెను తీసుకువెళ్లారు. గ్రామ శివార్లకు చేరుకున్న చెవిరెడ్డి లక్ష్మికి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు సాదరంగా స్వాగతం పలికారు. అనంతరం నడివీధిలో కొలువుదీర్చిన గంగమ్మలను దర్శనం చేసుకున్న చెవిరెడ్డి లక్ష్మి హారతులు ఇచ్చి మొక్కులు తీర్చుకున్నారు.

కట్టపుట్టాలమ్మకు సారె అందజేత

తిరుపతి కల్చరల్: కరకంబాడి సమీపంలోని కట్ట పుట్టాలమ్మకు బుధవారం చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి సతీమణి చెవిరెడ్డి లక్ష్మి అమ్మవారికి సారె సమర్పించారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో తిరుపతి రూరల్ ఎంపీపీ మూలం చంద్రమోహన్‌రెడ్డి, వైస్ ఎంపీపీ విడుదల మాధవరెడ్డి, ఎంపీటీసీ లక్ష్మయ్య, పార్టీ నేతలు పాల్గొన్నారు.

ఏలుమలై రెడ్డికి ప్రముఖుల నివాళి

చంద్రగిరి: తిరుచానూరు పంచాయతీ సర్పంచ్, వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత కీరకట్టు రామచంద్రారెడ్డి, ఎంపీటీసీ నరేష్ రెడ్డి తండ్రి ఏలుమలై రెడ్డి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. బుధవారం తిరుచానూరులోని వారి నివాసం వద్ద దశదిన కర్మక్రియలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ఆయనకు నివాళులు అర్పించారు. ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం, చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి సతీమణి, చెవిరెడ్డి లక్ష్మి హాజరయ్యారు. ఏలుమలై రెడ్డి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. అనంతరం ఆ కుటుంబ సభ్యులను ఓదార్చారు. వారితో పాటు తిరుపతి రూరల్ ఎంపీపీ మూలం చంద్రమోహన్ రెడ్డి, వైస్ ఎంపీపీ విడుదల మాధవరెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున హాజరయ్యారు.


ఏలుమలై రెడ్డి చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న చెవిరెడ్డి లక్ష్మి

ఓర్వ లేక తప్పుడు కేసులు పెడుతున్నారు

తిరుపతి కల్చరల్: తన ఎదుగుదల చూసి ఓర్వలేక రాజకీయ కక్షతో ఆర్థిక లావాదేవీల విషయాల్లో తనకు డబ్బులు ఎగ్గొట్టాలనే దురుద్దేశంతో పూసపాటి వెంకటరమణ, కల్లూరి హేమాద్రి తప్పుడు కేసులు బనాయిస్తున్నారని వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లా అధ్యక్షుడు నీరుగట్టు నగేష్ విజ్ఞప్తి చేశారు. బుధవారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పూసపాటి వెంకటరమణ అనే వ్యక్తికి చెందిన కిసాన్ సభ రైతు ప్రాజెక్టుకు మ్యాన్‌పవర్ నిమిత్తం తమ జాబ్‌కామ్ మ్యాన్‌పవర్ సంస్థ నుంచి అగ్రిమెంట్ నిమిత్తం అతనికి సెక్యూరిటీ డిపాజిట్ నిమిత్తం దశలవారీగా రూ.10 లక్షలు ఇవ్వడం జరిగిందన్నారు. ఏడు నెలలు గడుస్తున్నా పని ప్రారంభించకపోవడంతో జిల్లా ఎస్పీకి గత ఏప్రిల్ 21న ఫిర్యాదు చేయడంతో ఎస్వీ యూనివర్సిటీ పోలీసులు అతన్ని పిలిపించి విచారించా రని తెలిపారు. తనపై కక్షతో తప్పుడు కేసులు పెడుతున్నారని, న్యాయం చేయాలని కోరాడు.


మాట్లాడుతున్న నగేష్

నోటీస్ బోర్డు

- భవానీ నగర్‌లోని రోటరీ క్లబ్ కార్యాలయంలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, తిరిగి సాయంత్రం 4 నుంచి రాత్రి 8 గంటల వరకు మెగా ఆక్యుప్రెజర్ వైద్యశిబిరం
- టీటీడీ హిందూ ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో గాంధీరోడ్డులోని అభయ ఆంజనేయస్వామి, పాత హుజూర్ ఆఫీస్ శ్రీభక్త ఆంజనేయస్వామి, అలిపిరి పాదాల మండపం, కపిలతీర్థం వద్ద ఉన్న ఆంజనేయస్వామి ఆలయాల్లో ఉదయం 8 నుంచి హనుమాన్ జయంతి వేడుకలు, ప్రత్యేక పూజలు
- యశోదనగర్‌లోని వేమన విజ్ఞానకేంద్రం ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు చేతిరాత, చెస్, స్పోకెన్ ఇంగ్లిష్‌పై శిక్షణా తరగతులు నిర్వహణ
- కపిలతీర్థం వద్ద ఉన్న టీడీపీ కార్యాలయంలో ఉదయం 11.15 గంటలకు తిరుపతి నియోజకవర్గం మినీ మహానాడు
- రామువారి దక్షిణ మాడవీధిలోని చిగోరా ఆధ్యాత్మిక సేవా కేంద్రంలో సాయంత్రం 6 గంటలకు హనుమాన్ జయంతి వేడుకలు

శ్రీవారి సేవలో ప్రముఖులు


ఆలయం వెలుపల మాజీ మంత్రి రోజా

తిరుమల: తిరుమల శ్రీవారిని బుధవారం మాజీ మంత్రి ఆర్కే రోజా, మ్యూజిక్ డైరెక్టర్ తమన్, సినీ హీరోలు ఆదిసాయికుమార్, అశ్విన్ దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. శ్రీవారి దర్శనానంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనాలు అందించగా.. టీటీడీ అధికారులు ఘనంగా లడ్డూ ప్రసాదాలతో సత్కరించారు.

బీవీ రమణకు గ్రీన్ జర్నలిస్ట్ అవార్డు

తిరుపతి కల్చరల్: తిరుపతికి చెందిన సీనియర్ జర్నలిస్టు బీవీ రమణకు రాష్ట్ర జీవవైవిధ్య బోర్డు వారి గ్రీన్ జర్నలిస్టు అవార్డు లభించింది. ప్రకృతి పరిరక్షణ, ట్రెక్కింగ్ కళలు, గిరిజన సంస్కృతి వంటి రంగాల్లో ఆయన చేసిన విశేష కృషిని గుర్తించి ఆయనను ఈ అవార్డుకు ఎంపిక చేసినట్లు జీవవైవిధ్య బోర్డు యాజమాన్యం బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

తుడా అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తా

– తుడా చైర్మన్ డాలర్స్ దివాకర్‌రెడ్డి

తిరుపతి తుడా: తుడా అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తానని నూతన తుడా చైర్మన్ డాలర్స్ దివాకర్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన తుడా చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన అనంతరం పెరుమాళ్లపల్లి నుంచి తుడా కార్యాలయం వరకు అభిమానులు, పార్టీ కార్యకర్తలతో స్కూటర్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం పాత మున్సిపల్ కార్యాలయ సమీపంలో ఏర్పాటు చేసి బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. శ్రీవారి భక్తులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం ఆయన తుడా వీసీ మౌర్య, సెక్రటరీ శ్రీకాంత్ సమక్షంలో తుడా చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఈ ప్రమాణ స్వీకారోత్సవానికి తిరుపతి, చంద్రగిరి, పూతలపట్టు, శ్రీకాళహస్తి ఎమ్మెల్యేలు ఆరణి శ్రీనివాసులు, పులివర్తి నాని, మురళీమోహన్, సుధీర్ రెడ్డి, టీటీడీ బోర్డు సభ్యురాలు పనబాకలక్ష్మి, నేతలు తరలివచ్చారు.


తుడా చైర్మన్‌గా బాధ్యతలు చేపడుతున్న డాలర్స్ దివాకర్‌రెడ్డి

దళితుల సంక్షేమాన్ని విస్మరించిన కూటమి

తిరుపతి కల్చరల్: రాష్ట్రంలో దళితులపై దాడులు మితిమీరుతున్నా.. వాటిని అరికట్టడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, దళిత వ్యతిరేక దగా పాలన సాగిస్తూ దళితుల సమక్షేమాన్ని పూర్తిగా విస్మరించిందని రాయలసీమ మాలల జేఏసీ ప్రధాన కార్యదర్శి పూతలపట్టు ప్రభాకర్ ధ్వజమెత్తారు. ఓ ప్రైవేటు కళాశాలలో బీటెక్ విద్యార్థి జేమ్స్‌పై జరిగిన కుల వివక్ష దాడిని వ్యతిరేకిస్తూ బుధవారం రాయలసీమ మాలల జేఏసీ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి రాయలసీమ మాలల జేఏసీ అధ్యక్షుడు వై.సుదర్శన్, అంబేడ్కర్ భవన్ చైర్మన్ పరమశివన్, దళిత సంఘ నేతలు ధేనశేఖర్, స్వర్ణ వెంకయ్య, శ్రీకాంత్, మాధవయ్య పాల్గొన్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి

దళిత విద్యార్థిపై దాడి చేసిన వారిని తక్షణం అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని ప్రజా సంఘాల నేతలు డిమాండ్ చేశారు. కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం ఆధ్వర్యంలో బుధవారం వేమన విజ్ఞానకేంద్రంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వి.నాగరాజు, సీపీఐ జిల్లా నేత పెంచలయ్య, రిటైర్డ్ జడ్జి గుర్రప్ప, ఆర్‌పీఐ దక్షిణ భారత అధ్యక్షుడు పి.అంజయ్య, టీటీడీ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం నేత ప్రసాద్‌రావు పాల్గొని ప్రసంగించారు.


ఐక్యత చాటుతున్న దళిత సంఘాల నేతలు

చంద్రబాబు పాలనలో రక్షణ కరువు

చంద్రబాబు దగా కోరు పాలనలో దళితుల పట్ల వివక్షతతో దాడులు మితిమీరి వారికి రక్షణ లేకుండాపోతోందని రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షుడు దాసరి చెన్న కేశవులు మండిపడ్డారు. బుధవారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో దళితులపై వివక్ష దాడులు పెరిగిపోయాయన్నారు. ఇటీవల బీటెక్ విద్యార్థి జేమ్స్‌పై కొందరు అగ్రవర్ణాలు విచక్షణా రహితంగా దాడి హత్యాయత్నానికి ప్రయత్నించడం దుర్మార్గమన్నారు. ఈ సంఘటనపై ఇటు కళాశాల యాజమాన్యం, అటు రాష్ట్ర ప్రభుత్వం స్పందించకపోగా.. పోలీసులు కూడా దళిత విద్యార్థికి న్యాయం చేయకపోవడం విడ్డూరమన్నారు.

టీడీపీ కార్యకర్తలకేనా ప్రభుత్వ ఉద్యోగాలు?

భాకరాపేట(చంద్రగిరి): ఎన్నికల హామీలను గాలికొదిలేసిన కూటమి సర్కారు సొంత పార్టీ కార్యకర్తలకు ఉద్యోగాలు ఇప్పించడానికి ప్రాధాన్యత ఇవ్వ డం విడ్డూరంగా ఉందని వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు చెంగల్‌రెడ్డి మండిపడ్డారు. ఈ మేరకు ఆయన బుధవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గత ఎన్నికల సమయంలో అమలు చేయలేని హామీలతో ప్రజల ను మోసం చేసి చంద్రబాబు గద్దెనెక్కారన్నారు. ప్రభుత్వం ఏర్పడి ఏడాది కావొస్తున్నా ఇప్పటివరకు ఎన్నికల హామీలను నెరవేర్చిన దాఖలాలు లేవన్నా రు. ప్రజలను మోసం చేస్తూ ప్రభుత్వ పథకాలను రద్దు చేస్తున్న ఈ కూటమి సర్కారు, తన కార్యకర్తలకు మాత్రం ఏకంగా ప్రభుత్వ ఉద్యోగాలను కల్పించడం కోసం కేబినేట్‌లో ఆమోదం తెలపడం చరిత్రలో మొట్టమొదటిసారి అన్నారు. మిమ్మల్ని 2014లో ఓటేసిన వారికి ఇంటింటికీ ఓ ఉద్యోగం అని మోసం చేశారన్నారు. ఇప్పుడు కూడా నిరుద్యోగ భృతి ఇస్తాం అని చెప్పి..ఇప్పటివరకు ఎవరికి ఇచ్చారని ఆయన ప్రశ్నించారు. యర్రావారిపాలెం మండలం గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడు వీర నాగేంద్ర, నాగార్జున, శేషాద్రి, యశ్వంత్, జగదీష్, రుకేష్ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న చెంగల్ రెడ్డి

ఘనంగా పోతురాజు ఉత్సవం



చంద్రగిరి: మండల పరిధిలోని నరసింగాపురంలో నిర్వహించనున్న వార్షిక మహాభారత ఉత్సవాలకు నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ సందర్భంగా బుధవారం ఉదయం ఉత్సవాల ప్రారంభ సూచికగా పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఇందులో భాగంగా ద్రౌపదీ సమేత ధర్మరాజుల వారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఉత్సవ విగ్రహాలను శోభాయమానంగా అలంకరించి, భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. అనంతరం పోతురాజు ఉత్సవ విగ్రహాన్ని గ్రామంలో ఊరేగింపు ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. 18 రోజుల పాటు నిర్వహించే ఉత్సవాల్లో ఎలాంటి ఆటంకాలు కలగకుండా పోతురాజు పర్యవేక్షిస్తారని విశ్వాసం.

నేడు శ్రీకృష్ణ లీలలు.. : మహాభారత ఉత్సవాల్లో భాగంగా తొలిరోజు పగలు శ్రీకృష్ణలీలతో ఉత్సవాలు ప్రారంభం కానున్నాయని నిర్వాహకులు తెలిపారు. రాత్రి కంస వధ నాటిక ప్రదర్శన ఉంటుందన్నారు. ప్రముఖ ప్రముఖ భాగవతారిణి గీతావాణి ఆధ్వర్యంలో మహాభారత ఇతిహాసాలను పారాయణం చేయడం జరుగుతుందన్నారు.

అభివృద్ధి పనులకు భూమిపూజ

తిరుపతి రూరల్ : తిరుపతి రూరల్ మండలం పేరూరు గ్రామ పంచాయతీలో రూ.1.85 కోట్లతో చేపట్టే అభివృద్ధి పనులకు బుధవారం సర్పంచ్ దామినేటి కేశవులు, ఎంపీపీ మూలం చంద్రమోహన్ రెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు రత్నమ్మ, వైస్ ఎంపీపీ విడుదల మాధవరెడ్డి, ఎంపీడీఓ రామచంద్ర భూమిపూజ చేశారు. మండల పరిషత్ 15వ ఆర్థికసంఘం నిధులతో పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టినట్లు ఎంపీపీ మూలం చంద్రమోహన్‌రెడ్డి తెలిపారు. పేరూరు రాములవారి గుడి నుంచి గుణవతి ఇంటి వరకు మురుగునీటి కాలువ నిర్మాణానికి రూ.1.85 లక్షల అంచనా వ్యయంతో పనులు ప్రారంభించారు. మునస్వామి ఇంటి నుంచి షాపింగ్ కాంప్లెక్స్ వరకు పెద్ద కాలువపై కవర్ స్లాబ్ నిర్మాణానికి రూ.3.40 లక్షలు, గ్రామ ప్రజలకు సురక్షిత మంచినీటిని అందించేందుకు వీలుగా 2 వేల లీటర్ల సామర్థ్యం గల ఆర్‌ఓ ప్లాంట్ నిర్మాణానికి రూ.4.60 లక్షలు ఖర్చు చేస్తున్నారు. గ్రామంలో అభివృద్ధి పనులు చేపడుతుండడంపై గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ పరంధామ రెడ్డి, బీసీ సెల్ అధ్యక్షుడు చెంచుమోహన్ యాదవ్, జానకిరామిరెడ్డి, శశి, శివ, దేవ తదితరులు పాల్గొన్నారు.


మురుగునీటి కాలువపై స్లాబ్‌ల నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న వైస్ ఎంపీపీ మాధవరెడ్డి